"ఆపితే ఏమవుతుంది"

"ఈ విషయం ఆలిండియా రేడియో గమనిస్తుంది. ఆనక మధ్యాహ్నం న్యూస్‌లో మన విషయం ప్రసారం చేస్తుంది. అది సింగపూర్‌లో వున్న మీ గ్రాండ్ పాకి తెలిసి. . ."

అప్రతిభురాలైంది. అంటే తన గురించి చాలా వివరాలు సేకరించాడు.

"మిస్టర్ ధూర్జటీ" వ్యంగ్యంగా అంది "నా గురించి నీకెలా తెలుసూ అని నేను ఆశ్చర్యపోవడం లేదు. అది నీ ఐక్యూకి ఓ పెద్ద గుర్తుగా నేను భావించడమూ లేదు. కాని ఇంత తెలుసుకున్న నువ్వు నా స్థాయి మనిషితో ఇలా ప్లే చేయడం మంచిది కాదని నీ శ్రేయస్సు కోరి సలహా ఇస్తున్నాను"

"ఆ విషయం నిన్న సాయంకాలమే నాకు అర్థమైంది."

"పాపం" సర్కాస్టిక్‌గా అంది కృషి. "రాత్రంతా పోలీసులు చాలా హించించి వుంటారు.'

"కలగన్నారా. . ."

ఆ క్షణంలో ధూర్జటి 'కల'నే పదాన్ని వాడటం కాకతాళియమే అయినా నిన్నరాత్రి కల గుర్తుకు రాగానే నుదుట చెమట పట్టేసింది.

"నిన్న మీరు నన్ను పోలీసులకి పట్టించగానే బాగా తోమి తాటవలిచేసి వుంటారని మీరు అనుకుని వుంటారు. కాని మీ నుంచి నేను సంపాదించిన అయిదువేలలో ఓ వెయ్యి వాళ్ళ మొహాన కొట్టి బయటకొచ్చేసాను. ఏమిటి అలా తెల్లమొహం వేసుకుని చూస్తున్నారు."

"నమ్మలేక పోతున్నాను."

"ఏమిటి" నిశ్చలంగా అన్నాడు "నాలాంటి అందమైన ఓ యువకుడు ఇలా టోపీవేసే కార్యక్రమంలో నిమగ్నం కావటాన్నా లేక పోలీసులు డబ్బు తీసుకుని నన్ను విడిచిపెట్టడాన్నా"

నిశ్చేష్టితగా చూస్తుంది కృషి.

"ఇక్కడ మోసం చేయడం మనుషుల హాబీ. అవకాశవాదంతో పరిస్థితుల్ని అనుకూలంగా మలుచుకోవటం వ్యక్తుల నైజం. ఈ దేశంలో సక్సెస్ అన్న పదానికి అర్థం బ్రతకగలగడం. ఎలాగైనా పర్వాలేదు. ఉదాహరణకి మిమ్మల్ని పబ్లిక్‌గా. . . మరోలా అనకోకండి. మిమ్మల్ని దోచుకోగలను. అంటే మీ ఒంటిమీద వున్న నగా నట్రాలాంటిదే సుమండీ. అందులో కొంత పోలీసుల చేతిలో వుంచి నన్ను నేను రక్షించుకోగలను. . . మీ పరిభాషలో ఈ వ్యవస్థ అంతగా తగలబడి పోయింది."

"షేమ్. . ."

"మిమ్మల్ని దోచుకోవడమా."

"కాదు. బ్రతకటానికి మరోదారి లేనట్టు నీలాంటి వాళ్ళు ఇలా దోపిడీలు చేస్తూ అదే జీవనోపాధిగా మార్చుకోవడం ఆనక దోచుకున్నది పంపిణీ చేసి నిన్ను నువ్వు రక్షించుకొంటూ ఈ వ్యవస్థే ఇలా తగలబడిపోయిందని వాపోవడమూనూ"

"అద్దాలమేడలో బ్రతికే నీలాంటి అమ్మాయికి కొన్ని సమస్యలలోతు అర్థం కాదు"

"పెసిమిస్ట్ పరిస్థితులకి నెగిటివ్‌గా రియాక్టయి మోసగాడవుతాడు. ఆప్టిమిస్ట్ అలా బ్రతకడాన్ని అయిష్టపడుతూ అవసరమైతే ఆటో నడిపి పొట్టపోసుకుంటాడు."

ఫకాల్న నవ్వాడు.

"ఎందుకా నవ్వు"

"నేను ఆటోయే నడుపుకుంటే మీలాంటి అందమైన అమ్మాయి పరిచయమయ్యే అవకాశం వుండేదికాదుగా"

అతడేమిటో ఆ వ్యక్తి ఆలోచనలేమిటో పూర్తిగా అర్థం కాక ఇక అతడితో మాట్లాడే పనిలేనట్టు "ముందు కారు దిగు" అంది బింకంగా.

"పెనాల్టీ చెల్లించు"

"దేనికి" నివ్వెరపోయింది కృషి.

"నిన్న పోలీసులకి అప్పచెప్పి నా పరువు తీసినందుకు."

"నీకో పరువు. దానికో పెనాల్టీ"

"వెయ్యి రూపాయలు అనవసరంగా నష్టపోయాను కృషి. మర్యాదగా ఆ డబ్బిచ్చేయ్"

కృషి రెచ్చిపోయింది "ఇవ్వకపోతే"

రెండు క్షణాల పాటు రెప్పలార్పకుండా చూసాడు "ఏం చేసేదీ చెప్పమంటారా కృషి. అటు చూడండి. అక్కడున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓ వారగా ఆపివున్న ఈ ఇంపోర్టెడ్ కారుని పదినిముషాలుగా చూస్తున్నాడు. ఇక్కడ పార్క్ చేయకూడదని తెలిసినా ఎవరో పెద్దింటి అమ్మాయిగా భావించి మిమ్మల్ని అడగలేక చాలా మధన పడుతున్నాడు. . ."

కానిస్టేబుల్ చూపులు ఇంచుమించు అలాగే కనిపిస్తుంటే కోపాన్ని అదిమి పెడుతూ అంది "అయితే"

"ఇప్పుడు మీరు వెయ్యిరూపాయలు ఇవ్వకపోతే నేను మీ వేలెట్లోని డబ్బుని బలవంతంగా తీసుకు వెళతాను. అదిగో గట్టిగా అరుస్తాననకండి. ఒకవేళ అరిచాక బస్‌స్టాపులో వున్న జనం కాని కానిస్టేబుల్‌కాని పరుగెత్తుకొస్తే నన్ను ఓ దొంగని చెప్పగలరా. . .

"ఎందుకు చెప్పలేను"

"అప్పుడు ఇరుక్కునేది మీరే" ఓ అద్భుతమైన తర్కాన్ని ప్రయోగించాడు. "అవును కృషి దొంగే అయితే పది నిముషాల పాటు కారు డోర్స్ మూసుకుని ఎందుకు కూర్చున్నారూ అంటూ వాళ్ళు ప్రశ్నిస్తారు. బోయ్‌ఫ్రెండ్‌తో ఏదో రాచకార్యం వెలగబెట్టాలని కాకపోతే ఇంత సేపు గుసగుసలేమిటబ్బా అంటూ బుగ్గలు నొక్కేసుకుంటారు. అది మీకెంత డెలికేట్‌గా వుండేదీ మీరు కాకపోయినా నేనూహించగలను."

ఆమె కూడ ఊహించేసిందేమో ఆవేశంగా వేలెట్‌లోని వెయ్యి రూపాయలు తీసి అతడి

గలుగుతున్నాడు.

"థాంక్స్ మిస్ కృషి. ఆడపిల్ల కలల్లోకి చొచ్చుకురాగల అందగాడివయ్యుండీ నీకీ డబ్బు వ్యామోహం ఏమిటీ అన్నది బహుశా మీ మొహంలోని ఎక్స్‌ప్రెషన్‌కి అర్ధమనుకుంటాను. దానికి నా జవాబు ఒక్కటే. డబ్బునే ఓ అస్త్రంతో ప్రపంచాన్నే గెలిచేయగలనన్న థియరీనమ్మే మనిషిన్నేను."

క్షణంపాటు కేరక్టర్ విషయంలో తనూ 'గ్రాండ్‌పా' లాంటివాడ్నే అన్న విషయాన్ని సగర్వంగా వ్యక్తం చేసి కారు దిగి వెళ్ళిపోయాడు ధూర్జటి.

స్థాయీ భేదం తప్ప ఇద్దరి ఆలోచనల్లో ఒక్కటే.

తాతయ్య విషయంలో అనుసరించే స్తబ్ధత ఈ వ్యక్తితో ఎందుకు పాటించాలనే అనుకుందో లేక ఇత దారుణంగా ఓడించిన ఈ వ్యక్తికి శాశ్వతంగా బుద్ధి చెప్పాలనుకుందో కారుని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషనుకి పోనిచ్చింది.

నిజానికి తానెవరన్నది స్పష్టంగా తెలియచెప్పి అటు ధూర్జటిని విడిచి పెట్టిన పోలీసులకి ఇటు ధూర్జటికి బుద్ధి చెప్పటం కష్టం కాదు.

పది నిముషాలలో కారు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆగింది.

కారు దిగిన కృషిని చూస్తూ ముందుకు ఉరికి వచ్చాడు యస్సై. నిన్న ధూర్జటిని అరెస్ట్ చేసిన వెంకట్రావ్.

"గుడ్ మార్నింగ్ మాడమ్" చాలా వినయాన్ని ప్రదర్శించాడు యస్సై. "మీరిద్దరూ లవర్స్ అన్న విషయాన్ని దాచేసి మమ్మల్ని భలే ఫూల్స్‌ని చేసేసారు. బహుశా జరిగిందానికి క్షమాపణలు చెప్పటానికి వచ్చారనుకుంటాను."

"వ్వాట్" దిగ్భ్రాంతిగా చూసింది కృషి.

"మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు" సీరియస్‌గా అంది కృషి.

ఆమె ముఖకవళికల్ని చూస్తూ చాలా ఇబ్బంది పడిపోయాడు యస్సై వెంకట్రావ్. "ఏదో తొందరపాటులో వివరాలు అడక్కుండా మీ బోయ్‌ఫ్రెండ్‌ని అరెస్ట్ చేశామే అనుకోండి. అంతమాత్రం చేత ఇండియన్ పోలీసులంతా ఫూల్సని మీరు తేల్చేయడం న్యాయం కాదు."

వచ్చింది ధూర్జటిని ఎలా వదిలిపెట్టారో తెలుసు కోవడానికైతే ఇక్కడ మరోటి వింటూంది ఆమె.

"నిజమే. . ." తన తప్పిదాన్ని ఒప్పుకుంటున్నట్టుగా చెప్పాడు యస్సై వెంకట్రావ్. "రూల్ ప్రకారం మీ దగ్గరనుంచి ముందు రిటెన్ కంప్లెయింట్ తీసుకోవాలి. ఆ తర్వాతే నేరస్తుడ్ని స్టేషన్‌కి రప్పించి పరిశోధన ప్రారంభించాలి. కాని నా పొరపాటెక్కడంటే మీరు చెప్పగానే రియాక్టయిపోవడం, మీ మాటమీద విశ్వగార్ని అరెస్ట్ చేయడం. . ."

"విశ్వ ఎవరు. . ."

"మీ బోయ్‌ఫ్రెండ్"

ఇదంతా ఏమిటో ఆమెకు బోధపడకపోయినా ధూర్జటి చాలా తెలివిగా పోలీసుల్ని ఫూల్స్‌ని చేసి తప్పించుకున్నాడని అర్థమైపోయింది.

"అతనేం చెప్పాడు మీకు." సాలోచనగా అడిగింది.

"మీరు పుట్టింది ఇండియాలోనే అయినా పెరిగింది స్టేట్స్‌లో అన్నాడు. మీ మధ్య తరుచుగా ఇండియన్ పోలీసుల తెలివి తక్కువ తనం గురించి వాగ్యుద్ధం జరుగుతుండేదని వివరంగా చెప్పేశాడు. ఈ దేశంలో పోలీసులు నిజాయితీ గురించి మేధస్సు గురించి నీకేం తెలుసని మొన్నెప్పుడో మిమ్మల్ని నిలదీసిన విషయమూ డిటైల్డ్‌గా వివరించాడు."

"తర్వాత" ప్రశ్నార్థకంగా చూసింది కృషి.

మొత్తం వివరాలన్నీ తన చేతనే ఆమె చెప్పించడం బొత్తిగా నచ్చలేదు యస్సైకి. "అసలు ఛాలెంజ్ చేసింది మీరేనన్నాడు"

"ఏ విషయంలో"

"పోలీసులు ఫూల్సని నిరూపించడంలో"

ఆమె నిశ్చలంగా చూసింది.

"అసలు మీరు మమ్మల్ని పిలవడమేమిటి, మీ బోయ్‌ఫ్రెండ్‌ని ఓ మోసగాడిగా మాకు చెప్పడమేమిటి, వెనక ముందూ చూడకుండా ఓ కోటీశ్వరుడికి కాబోయే అల్లుడ్ని మేం అరెస్టు చేయడమేమిటి. ఛ ఛ. మీ నమ్మకాన్ని నిజం చేసేసాను, తప్పు నాదే"

"అయినా కరెక్టు చేసుకున్నారుగా" ధూర్జటి ఎంత తెలివిగా తప్పించుకుపోయింది మననం చేసుకుంటూ అంది కృషి. "మరి తను ఏ కోటీశ్వరుడికి కాబోయే అల్లుడో చెప్పాడా."

"మీరు ఉపాధ్యాయ గారి మనవరాలని తెలిశాక ఇక మీ తండ్రిగారితో మాకు పనేముంది చెప్పండి"

నిర్విణ్ణురాలైంది కృషి.

"సరే." తదేకంగా చూస్తూ అందామె-

"ఛాలెంజ్‌లో ఎవరుగెలిచినా మీకు శ్రమ కలిగించినందుకు కొన్ని ఫార్మాలిటీస్ పాటించటానికి డబ్బిచ్చాను మీకు అందజేయమని."

చక్కలిగిలి పెట్టినట్టు మెలి తిగిగిపోయాడు వెంకట్రావ్.

"సిగ్గుపడకండి. స్టేట్స్‌లోనూ పోలీసులు ఇలాంటి ఫార్మాలిటీస్‌ని కాదనరు."

"మరే. ఎక్కడయినా ఇంతే అనుకుంటాను మేడమ్" బోలెడంత సిగ్గుపడుతూ ఎంత తీసుకున్నదీ చెప్పకపోయినా మొత్తానికి డబ్బు తీసుకున్నట్టు పరోక్షంగా తెలియచెప్పాడు.

"అద్సరే..." చివరిగా అడిగింది కృషి.

"నా ఛాలెంజ్ ప్రకారం మిమ్మల్ని తప్పుదోవ పట్టించాను. కాని తన అసలు పేరు ధూర్జటి అని చెప్పకుండా మరోటి చెప్పి ఆయని మిమ్మల్నెందుకు మిస్‌లీడ్ చేసాడు?"

"ధూర్జటా... ఆయన అసలుపేరు విశ్వనాథ్‌గా"

"అలా అని చెప్పాడా"

"చెప్పడమేమిటి మేడమ్. లెటర్‌లో స్పష్టంగా విశ్వనాథని వుందిగా పైగా మీరుకూడా ముద్దుగా 'విశ్వు' అని పిలుస్తుంటారటగా" అతను కూడా ఇందాక 'విశ్వు' అని అడ్రస్ చేసింది ఆమెను ప్లీజ్ చేయాలనే అన్న విషయం చెప్పలేదు వెంకట్రావ్.

మరో కొత్త విషయం వింటున్నట్టుగా అడిగింది కృషి "లెటరేమిటి"

"అదే మేడమ్. ఈ రోజు సాయంకాలం అరుగంటలకి ఉస్మానియా యూనివర్శిటీ ఆడిటోరియంలో ఐక్యూ కాంపిటీషన్ వుందిగా. దానికి అటెండ్ కమ్మని 'కోలా' కంపెనీ వాళ్ళు రాసింది"

ఆమె భృకుటి ముడిపడింది.

"అసలా ఆ కాంపిటీషన్‌కి ఆయన అటెండ్ కావడం మీకిష్టం లేకనే ఛాలెంజ్ పేరిట మీరాయన్ని అరెస్ట్ చేయించిన విషయమూ ఆయన చెప్పేశాడు."

ఈ అభియోగమూ ఆమెకు నచ్చలేదు. "మరి నాకెందుకు ఇష్టం లేదో అదీ చెప్పాడా"

"ఆయనలాంటి జీనియస్‌లు పోటీల్లో పాల్గొంటే పైకొచ్చే యువతకి అవకాశం ఉండదన్నారటగా. . ."

చిర్రెత్తుకొస్తున్నా నిభాయించుకుంది. అతనో జీనియస్ అవునో కాదో గాని ఖచ్చితంగా ఈ పోలీసాఫీసరు మాత్రం ఫూలని బోధపడిపోయింది.

అతని పేరు నిజంగా విశ్వనాథేనా లేక ఏదో ఉత్తరాన్ని చూపించి తెలివిగా తప్పించుకున్నాడా.

ఆలోచిస్తూ కారు దగ్గరికి వచ్చింది.

అతడి ఐక్యూ స్థాయి ఏదయినా గాని డబ్బు ఇచ్చో లేక సమయస్ఫూర్తిని ప్రదర్శించో చాలామందితో మాత్రం సులభంగా ఆడుకోగలుగుతున్నాడు.

ఇంటికి తిరిగివచ్చిన కృషి అతడిపై ఆసక్తిని ప్రదర్శించడం అనవసరం అనుకుంటూనే సాయంకాలం దాకా గడిపింది.

ప్రత్యేకించి ఓ వ్యాపకం అంటూ లేకపోవడం కృషి ఎంత అసహనానికి గురిచేసింది అంటే యూనివర్శిటీకి వెళ్ళకుండా వుండలేకపోయింది.

అతడ్ని చూడాలని కాదు.

విశ్వనాథ్ అతడవునో కాదో తెలుసుకోవాలని.

అంతకు మించి ఐక్యూ కాంపిటీషన్స్‌పై ఆమెకున్న ఆసక్తి కూడా అప్పటికి ఆమెను ప్రేరేపించింది.

0 0 0 0

"డియర్ ఫ్రెండ్స్" యూనివర్శిటీ ఆడిటోరియంలోని ప్రేక్షకులను ఉద్దేశిస్తూ మాట్లాడుతున్నాడు 'కోలా' కంపెనీ ప్రతినిధి "సాఫ్ట్ డ్రింక్ కంపెనీ ఆధ్వర్యంలో

నిర్వహించబడుతున్న పోటీ ఇది. గత మూడు సంవత్సరాలుగా కోలా క్విజ్ కింగ్‌గా ఛాంపియన్‌షిప్ కాపాడుకుంటున్న యూనివర్సిటీ విద్యార్థి రాజేంద్ర ఈ రోజు మరో ఛాలెంజ్ ఎదుర్కోబోతున్నాడు. ఇద్దరి మధ్యా జరుగుతున్న ముఖాముఖీ పోటీలో గెలిచిన వ్యక్తి ఛాంపియన్ షిప్ ట్రోఫీతో బాటు ఇరవై వేల రూపాయల క్యాష్ ప్రైజ్ సాధించగలుగుతాడు. ఇప్పుడు ఇద్దరు యువకుల్నీ మీకు పరిచయం చేస్తున్నాను. మిస్టర్ రాజేంద్ర. . . డిఫెండింగ్ ఛాంపియన్"

సుమారు ఇరవై రెండేళ్ళ వయసున్న రాజేంద్ర ఉత్సాహంగా డయాస్‌పై అడుగుపెట్టగానే విద్యార్థుల చప్పట్లతో అభిమానమో లేక పని గట్టుకుని ఏర్పాటు చేయబడిన బృందమో- రాజేంద్రకి అనుకూలంగా నినాదాలు ప్రారంభించారు.